క్లుప్తంగా

ప్రాసెసింగ్ ఫీజు లేకుండా రుణాలు


రంగస్వామి

సోమల: వ్యవసాయ, బంగారు రుణాలపై రూ.25 లక్షల వరకు ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేయమని యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ రంగస్వామి తెలిపారు. బ్రాంచ్ మేనేజర్‌గా గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న మేనేజర్ దుర్గాప్రసాద్ నెల్లూరుకు బదిలీ అయ్యారు. రంగస్వామి మాట్లాడుతూ రైతులకు విరివిగా రుణాలు ఇస్తామని తెలిపారు. పాసు పుస్తకాలపై, బంగారుపై రుణాలు ఇస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి


ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, అధికారులు

రొంపిచెర్ల: పర్యావరణాన్ని ప్రజలు పరిరక్షించుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి అన్నారు. సేవ్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు, ఇంధనం, వృక్ష సంపదను రక్షించుకోవాలన్నారు. ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి, ఎంపీడీవో రాజేంద్ర, సెక్షన్ ఆఫీసర్ గిరీశం, బీట్ ఆఫీసర్ కృష్ణమూర్తి, సర్పంచ్ నాగిరెడ్డి, కార్యదర్శులు హరిబాబు, శివ గణేష్, సీసీ రమణా రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సింగిల్‌విండోలో దీర్ఘకాలిక రుణాలు

గుడుపల్లె : ప్రాథమిక సహకార పరపతి బ్యాంకు(సింగిల్ విండో)లో రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తామని సీఈవో దిలీప్ రామమూర్తి తెలిపారు. బ్యాంకుతో అనుసంధానం ఉన్న రైతులకు పాసు పుస్తకాలపై స్వల్పకాలిక పంట రుణాలు, బంగారు తాకట్టుతో దీర్ఘకాలిక రుణాలు, జాయింట్ లయబిలిటి గ్రూపులకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రామరథానికి వస్త్రాలంకరణ



చిత్తూరు రూరల్: చిత్తూరులోని శ్రీకోదండరామస్వామి ఆలయ రథానికి బుధవారం వస్త్రాలంకరణ చేశారు. ఇటీవల ఆలయానికి నూతన రథాన్ని తయారు చేయించారు. ఈ నేపథ్యంలో దాతలు, రథానికి వస్త్రాలంకరణ చేసి ట్రయల్ చూశామని నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు పుష్పపల్లకీ సేవ

చిత్తూరు రూరల్: గంగజాతర పురస్కరించుకుని చిత్తూరులోని దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం పుష్పపల్లకీ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించనున్నట్టు ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఉదయం 9 గంటలకు 1008 బిందెలతో జలాభిషేకం, సాయంత్రం అమ్మవారికి పసుపు అలంకారం, రాత్రి 9 గంటలకు పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

పట్టాలిచ్చారు.. స్థలం చూపలేదు

చిత్తూరు రూరల్: జీడీనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాళేపల్లె పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి..స్థలం చూపలేదని ఇండియన్ ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షులు రెహమాన్ ఆరోపించారు. చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పేదలకు ఇళ్ల పట్టాలిచ్చినా స్థలాలు చూపకపోవడంతో కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వారికి స్థలాలు ఇప్పించాలని కోరారు.

గుండెపోటుతో ఏఆర్ కానిస్టేబుల్ మృతి


పురుషోత్తం (ఫైల్)

చిత్తూరు అర్బన్: చిత్తూరు ఏఆర్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పురుషోత్తం గురువారం వేకువజామున గుండెపోటుకు గురై హఠాన్మరణం చెందారు. ఐరాల మండలం బెస్తపల్లెకు చెందిన ఈయన చిత్తూరు పీసీఆర్ కళాశాల వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుండెపోటుకు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యపరీక్షలు చేసిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఆదర్శ పలమనేరే లక్ష్యం

- ఎక్కడికి వెళ్లినా జనం ఆప్యాయత
- సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం
- ఎమ్మెల్యే వెంకటేగౌడ


సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ, ఎంపీ రెడ్డెప్ప

పలమనేరు: పలమనేరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే వెంకటేగౌడ తెలిపారు. సంక్షేమ లబ్ధిపై ఆరా తీయడంతోపాటు సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పాతపేట 16 వార్డులో ఎంపీ రెడ్డెప్పతో కలసి గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి పథకాల లబ్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధిని అందిస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్‌లను అందజేశారు. స్థానికులు విన్నవించిన కొన్ని సమస్యలను ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి కౌన్సిలర్ చెప్పి మంజూరు చేయిస్తామని హామీఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ ఇంటికి వెళ్లినా జనం ఆప్యాయంగా పలుకరిస్తున్నారని తెలిపారు. నూటికి పదిశాతం మాత్రమే సమస్యలను చెబుతున్నారని తెలిపారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలను కలసి ప్రత్యక్ష్యంగా వారి సమస్యలను పరిష్కరించడంలో చాలా తృప్తి ఉంటుందన్నారు.

ప్రజల మనిషి వెంకటేగౌడ

నియోజకవర్గంలో ఎక్కడ ఏ గడపకెళ్ళినా వారి పేరు పెట్టి పిలిచే ఎమ్మెల్యేల్లో రాష్ట్రంలో అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో వెంకటేగౌడ ముందంజలో ఉంటారని ఎంపీ రెడ్డెప్ప పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాలను తుచ తప్పకుండా పాటిస్తూ గడపగడపకు కార్యక్రమంలో పాల్గొంటు రాష్ట్రంలోనే ఆయన టాప్‌లో ఉండడం గొప్పవిషయమన్నారు. ఎన్ని ఇబ్బందులున్నా పక్కనబెట్టి ఈ కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకుంటూ వాటిని పరిష్కరించడమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీ మురళీకృష్ణ, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, కౌన్సిలర్లు శ్యామ్ సుందర్‌రాజు, శ్యామ్, హైదర్, కుమార్, కోదండరామయ్య, నయాజ్, హయాత్, రవి, రమేష్‌రెడ్డి, మూర్తి, రెడ్డెప్పరెడ్డి, గోవిందప్ప తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి పలమనేరు ఉరుసు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: పట్టణంలోని దండపల్లి రోడ్డు వద్ద వెలసిన హజరత్ గంజ్ షాహిద్ షావలి జలాలుద్దీన్ బాబా 75వ ఉరుసు మహోత్సవ పోస్టర్లను పార్లమెంటు సభ్యుడు రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ గురువారం ఆవిష్కరించారు. ఈనెల 26న గంధం, 27,28 తారీఖుల్లో ఖవ్వాలీ కార్యక్రమాలుంటాయని నిర్వాహకులు బీడీ మస్తాన్, సర్వర్, హైదర్, ఖదీర్, ఎజాజ్, అస్లాం తదితరులు తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణలో పట్టణానికి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

పలుచోట్ల గాలీవాన బీభత్సం


కుప్పం: విద్యుత్ తీగలపై పడిన స్టేడియం రేకులు

కుప్పం: పట్టణంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. వడ్డిపల్లి వద్ద ఎన్టీఆర్ స్టేడియం పైకప్పు రేకులు ఎగిరి పక్కనే ఉన్న విద్యుత్ తీగలపై పడ్డాయి. ఒక విద్యుత్ స్తంభం విరిగిపోగా, పట్టణంలో గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సిబ్బంది తక్షణం స్పందించి సరఫరాను పునరుద్ధరించారు. అలాగే మండలంలో వడగండ్ల వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో మామిడి చెట్లపై వడగండ్లు పడడంతో పెద్ద ఎత్తున పంట దెబ్బతినింది. టమాటా, వంగ తదితర పంటలు కొంత వరకు దెబ్బతిన్నాయి.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు–పులిచెర్ల మార్గంలో గురువారం సాయంత్రం తుడుంవారిపల్లె సమీపంలో రోడ్డుపై 11కెవీ విద్యుత్ లైన్ తెగి పడింది. గుర్తించిన స్థానికులు ఈమార్గంలో వచ్చే వాహనాలను ఆపేసి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ ఆపేసి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ప్రమాదం తప్పింది.

డ్రోన్ సర్వేతో మున్సిపల్ ఆస్తుల గుర్తింపు


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న కమిషనర్

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31 వార్డుల పరిధిలో డ్రోన్ సర్వేను కమిషనర్ నరసింహప్రసాద్ రెడ్డి గురువారం ప్రారంభించారు. స్థానిక ఎన్ఎస్‌పేట ప్రభుత్వ కళాశాలలో సర్వే కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మాట్లాడుతూ మున్సిపాలిటిలోని ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు, భవనాలు, కాలువలు, వంకలు, నదులు తదితర వాటిని సర్వే ద్వారా గుర్తిస్తామని తెలిపారు. వీటి సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్యం గుర్తించి మున్సిపల్ రికార్డుల్లో నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఆస్తులను గుర్తించడంతోపాటు ఆదాయాన్ని పెంపొందించుకునేందుకు వీలుంటుందని తెలిపారు. సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కుప్పంలో జాతర సందడి


సాంస్కృతిక కార్యక్రమాలు



విశేషాలంకరణలో వినాయకస్వామి, మారెమ్మ అమ్మవారు

కుప్పం: పట్టణంలో శ్రీప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా బుధవారం రాత్రి వినాయకస్వామి, గురువారం ముత్తుమారెమ్మ ఊరేగింపు పట్టణ పురవీధుల్లో వేడుకగా జరిగింది. ఆలయ ప్రాంగణం నుంచి మంగళవాయిద్యాల నడుమ నేతాజీరోడ్డు, ఆర్ఎస్‌పేట, రైల్వేగేటు వరకు ఊరేగింపు నిర్వహించారు.

రంజింపజేసిన సాంస్కృతిక కార్యక్రమాలు

గురువారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరింపజేశాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీదేవి డ్రామా కంపెనీ నటీనటులతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున జనం విచ్చేశారు. బస్టాండు నుంచి అమ్మవారి ఆలయం వరకు జనం కిక్కిశారు. అర్ధరాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగినా జనం పెద్ద సంఖ్యలో వీక్షించారు. టీవీ కళాకారుల డ్యాన్సులను చూసేందుకు జనం పెద్దసంఖ్యలో విచ్చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు పెద్ద ఎత్తున అన్నదానం

జాతర సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మంజూనాథ్, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్ తెలిపారు. ఆలయ ప్రాగణంలో 10 వేల మంది ప్రశాతంగా భోజనాలు చేసే విధంగా ఏర్పాట్లు చేసినట్లు వారు తెలిపారు. రాత్రి ముత్తమారెమ్మ ఊరేగింపు, రాత్రి టీవీ నటీనటుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ఖరీఫ్‌కు సమాయత్తం కావాలి

- జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్ర ఉప సంచాలకులు గోపాల్


మాట్లాడుతున్న ఉప సంచాలకులు గోపాల్

చిత్తూరు రూరల్: ఖరీఫ్ సీజన్ దృష్ట్యా రైతులు పంటల సాగుకు సమాయత్తం కావాలని, మెలకువలు పాటించి, మేలైన దిగుబడి సాధించాలని జిల్లా వ్యవసాయ శిక్షణ కేంద్ర ఉపసంచాలకులు గోపాల్ అన్నారు. చిత్తూరు మండలం చెర్లోపల్లెలోని రైతు భరోసా కేంద్రంలో గురువారం ఆయన ఖరీఫ్ సీజన్‌లో రైతులు పాటించాల్సిన మెలకువలు, సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలుత వేరుశనగ సాగులో విత్తన శుద్ధి గురించి వివరించారు. విత్తుకు ముందు లోదుక్కులు చేసుకోవాలని సూచించారు. తొలుత భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి వేణుగోపాల్, సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ ప్రతిమారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివరాజ్, అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తెరవాలని నిరసన


నిరసన తెలుపుతున్న పాఠకులు, స్థానికులు

తవణంపల్లె: స్థానిక గ్రంథాలయాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతూ స్థానికులు గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వం జాతీయ గ్రంథాలయ ఉత్సవాలను నిర్వహిస్తున్నా తవణంపల్లె గ్రంథాలయాన్ని కనీసం తెరవకపోవడం దారుణమన్నారు. జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిన తవణంపల్లె గ్రంథాలయాన్ని దాతల సహకారంతో అభివృద్ధి చేసుకున్నట్టు తెలిపారు. రెండేళ్ల క్రితం లైబ్రేరియన్ సుబ్రమణ్యం బదిలీ అయ్యారని, తర్వాత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ గ్రంథాలయాన్ని మూసేశారని ఆరోపించారు. జిల్లా గ్రంథాలయ అధికారులు స్పందించి వెంటనే గ్రంథాలయాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

- ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన నేత్రకు బహుమతి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దపంజాణి: మండలంలో తాగునీటి కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.రెడ్డెప్ప అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో పెట్టుకుని మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులతో ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని ఏపీఓ చిన్న రెడ్డెమ్మను ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని తెలిపారు. పాఠశాలల్లో నాడు–నేడు పనులను త్వరగా పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. అందుకోసం స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారం తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో వర్షపు నీరు వృథా కాకుండా సప్లై చానళ్లు, ఫీడింగ్ చానళ్ల పనులపై ఉపాధి హామీ సిబ్బంది దృష్టి సారించాలని తెలిపారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం శాఖల వారీగా అధికారులు వారి ప్రగతి నివేదికలను వినిపించారు.

టెన్త్ టాపర్‌కు నగదు బహుమతి

పది ఫలితాలలో 582 మార్కులు సాధించి పెద్దపంజాణి మండలం టాపర్‌గా నిలిచిన రాజుపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని వి.నేత్రకు మండల పరిషత్ తరపున రూ.3000 నగదు బహుమతిని అందజేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, సింగిల్ విండో చైర్మన్ ఓబుల్ రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, తహసీల్దార్ హనుమంతు, ఎంపీడీఓ టీ.శ్రీనివాస విశ్వనాథ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ప్రొటోకాల్ రగడ కారణంగా వీరప్పల్లి టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు సుబ్రమణ్యంను సమావేశం నుంచి సస్పెండ్ చేశారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం


సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్సీ భరత్


పీహెచ్‌సీలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఇందిరానగర్, జెడ్పీ హైస్కూల్ వీధి, రామనగర్ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమ్మేకమయ్యారు. నవరత్నాల కార్యక్రమం ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి అందుతున్నట్లు తెలిపారు. ఇళ్లస్థలాలు కావాలని పలువురు అడగడంతో త్వరలోమంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఇందిరా నగర్‌లో సిమెంటు రోడ్లు వేయాలని కోరగా, త్వరలో రూ.50 లక్షలు వ్యయంతో రోడ్లు వేయనున్నట్లు వెల్లడించారు. ఓ మహిళ విజ్ఞప్తి మేరకు అప్పటికప్పుడు జేసీబీతో కాలువలో పూడిక తీయించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

రామకుప్పం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్సీ భరత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోజువారీ అవుట్ పేషెంట్‌ల వివరాలను తెలుకున్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. ఫిర్యాదులు వస్తున్నాయని, సర్దుబాటు చేసుకుని రోగులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యాధికారికి సూచించారు. ఈ కార్య క్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కోకన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, వార్డు సభ్యులు జమీను ప్రసాద్, అబ్దుల్, గోపీకృష్ణ, నేతలు అబ్దుల్‌సాబ్, సైపుల్లా, గయాజ్, జబీవుల్లా, తజ్‌ముల్ పాషా, వెంకటాచలపతి, శంకర్, గణేష్ రెడ్డి, అబ్దుల్ ఘని పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు మండలం తుమ్మిందలో గురువారం వైఎస్సార్ జలకళ పథకం కింద రైతులకు బోరు మోటార్లు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకుంటున్నారన్నారు. రైతాంగానికి ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారన్నారు. పెట్టుబడి సాయం, పంట నష్టపరిహారం వంటివి అందిస్తూ రైతులకు చేయూతనిస్తున్నారన్నారు. వైఎస్సార్ జలకళ పథకం కింద ప్రభుత్వం ఇటీవల ఉచితంగా బోర్లు వేయించిందన్నారు. వాటికి బోరు మోటార్లను కూడా ఉచితంగా ఇస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకుని రైతులు వ్యవసాయ రంగంలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయరాం, నాయకులు త్యాగరాజులు, ప్రతిమారెడ్డి, మునిరత్నం, నంద, ఎంపీడీఓ రాఘవేంద్రవర్మ, ఏపీఓ రెడ్డెమ్మ పాల్గొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి పేరెత్తే అర్హత నల్లారికి లేదు

- ఎర్రచందనం స్మగ్లింగ్ చరిత్ర నీది
- రైతుల కోసం ప్రాజెక్టులు నిర్మిస్తుంటే ఓర్వలేకే ఆరోపణలు
- నోరు అదుపులో ఉంచుకోకుంటే తీవ్ర పరిణామాలు
- వైఎస్సార్‌సీపీ నేతల మండిపాటు

సదుం: వార్డు సభ్యుడిగా సైతం గెలవలేని టీడీపీ నాయకుడు నల్లారి కిశోర్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేరెత్తే అర్హత లేదని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. మంత్రిపై ఆయన చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. అన్న కిరణ్ సీఎంగా ఉన్నప్పుడు ఎర్రచందనం స్మగ్లింగ్‌లో రూ.కోట్లు సంపాదించుకున్న నీచ చరిత్ర కిశోర్‌దని చెప్పారు. సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే విమర్శించడం అవివేకమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, సచివాలయాల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్ప రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, సర్పంచ్‌లు ఉషారాణి, మనోహర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఎల్లప్ప, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, మోహన్‌రెడ్డి, రమణారెడ్డి, రవిరెడ్డి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కిషోర్ నోరు అదుపులో ఉంచుకో

సోమల: నోరు అదుపులో ఉంచుకుని మంత్రి పెద్దిరెడ్డిపై మాట్లాడాలని కిషోర్ కుమార్‌రెడ్డిని ఎంపీపీ ఈశ్వరయ్య,వైస్ ఎంపీపీ ప్రభాకర హెచ్చరించారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మంత్రి పెద్దిరెడ్డిపై కిషోర్‌కుమార్ రెడ్డి చేసిన విమర్శలను వారు తిప్పికొట్టారు. జిల్లాకు ×నీ కుటుంబం కాని, ఇప్పుడు నువ్వు ఉన్న నీ పార్టీ అధినేత గాని ఎప్పుడైన ప్రజలను కనీసం పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. మీ అన్న సీఎంగా ఉన్నప్పుడు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎర్ర చందనం తరలించిన విషయం అందరికీ తెలుసన్నారు. పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు ప్రజల దాహార్తి తీర్చేందుకు ప్రాజెక్టులు నిర్మిస్తుంటే ఓర్వలేక మీ పార్టీ కనుమరుగు అవుతోందని భయం పట్టుకున్నట్లు ఉందని ఆరోపించారు. అవాస్తవ ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, నేతలు వరదం వెంకటరమణ, సాంబశివయ్య, పీఎస్ఆర్ రాజారెడ్డి, ఆటోప్రసాద్, జుబేర్ పాల్గొన్నారు.

విమర్శలు హాస్యాస్పదం

పులిచెర్ల(కల్లూరు): జిల్లా ప్రజలకు మంచి చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వారి కుటుంబంపై బురదజల్లడం హాస్యాస్పదంగా ఉందని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డికి లేదన్నారు. గురువారం కల్లూరులో విలేకరులతో వారు మాట్లాడుతూ అన్నను అడ్డుపెట్టుకుని ఎర్రచందనం దోచుకున్నది మీరుకాదా, ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి జిల్లాలో పుంగనూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో తాగు, సాగు నీరందించడానికి ఆయన మంత్రి ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రిగా మీ అన్న చేయలేని పనిని పెద్దిరెడ్డి చేస్తున్నారని తెలిపారు. ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, సర్పంచ్ షుకూర్, నటరాజ, ముఖ్వల నరసింహులు శెట్టి, ముఖ్వల శేఖర, దామోదర్, సాకత్ అలీ, మునస్వామి, కోదండ, షాజిద్, నాగరాజ తదితరులు పాల్గొన్నారు

ధోరణి మార్చుకో..

రొంపిచెర్ల: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించే స్థాయి నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డికి లేదని ఎంపీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ పెద్దిరెడ్డిని వార్డు మెంబర్‌గా కూడా గెలవని కిషోర్ విమర్శించడం తగదన్నారు. ధోరణి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతుల కోసం నిర్మిస్తున్న సాగు నీటి ప్రాజెక్టులు కమీషన్ కోసమేనని ఆరోపించడం నీచాతినీచమని మండిపడ్డారు. ప్రాజెక్టులు నిర్మిస్తే టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారని అన్నారు. 40 సంవత్సరాలుగా జిల్లాలో ఎక్కడ జరగని అభివృద్ధి పుంగనూరులో జరిగిందన్నారు. విమర్శలు చేసే ముందు స్థాయిని గుర్తించాలని సూచించారు. జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగిరెడ్డి, నాయకులు శ్రీనాథనా యుడు, కమలాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, సూర్య నారాయణ రెడ్డి, లోకనాథరెడ్డి, శ్రీనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.